




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 91 | సోమవారం 31 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా...?









**-రాయలసీమ ప్రాంతానికి నీటి విడుదల ఎప్పుడు**

**-నంద్యాలమాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి**

నంద్యాల ఆగస్టు 30 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దాటి మూడవ సంవత్సరంలో పాలన మరింత దారుణంగా మారిందని, మొదటి సంవత్సరంలో పంటనష్టం, రెండవ సంవత్సరం గిట్టుబాటు ధరలు లేవని, ఈ సంవత్సరం పంటలు సాగుచేయలేని దుర్భిక్షపరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా? రాయలసీమ ప్రాంతానికి ఎప్పుడు నీటి విడుదల చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ లో 873 అడుగుల నీటి నిల్వాలు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, త్రాగునీరు వదలాలని ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల మండలం కానాల చెరువును మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కానాల చెరువులో చుక్కనీరు లేక ఎండిపోయిన పరిస్థితి ఉన్నదని, గత రెండు సంవత్సరాలుగా రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్న తరుణంలో ఈ ఏడాది అయినా ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన రైతన్నల ఆశలు అడిఆశలుగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులే రైతులను పంటలు సాగు చేయవద్దని చెప్పడం జరిగిందని, పంటలు సాగు చేయని పక్షంలో ప్రత్యామ్నాయ వనరులను కల్పించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90శాతం పూర్తి చేస్తే కేవలం 10శాతం మాత్రం పూర్తి చేయాల్సి ఉండగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను నిలిపివేయడం ఒక దొంగచాటు వ్యవహారమని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీరు లేక రైతులు పంటలు పండించని పరిస్థితి, ఇక గ్రామాల్లో త్రాగునీరు లేక పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని ఈ దారుణమైన పరిస్థితిని గమనించి ప్రభుత్వం దిగువకు నీటిని వదిలి రాయలసీమ ప్రాంత వాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం పంటల ఇన్స్యూరెన్స్ లేదని, అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదని విమర్శించారు. కానాల చెరువులో మట్టి త్రవ్విన గుంతలు కనిపిస్తున్నాయని, ఈ చెరువులో మట్టిని ఏప్రాజెక్ట్ కు అవసరం అయి చేశారు? ఈ మట్టి వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత? మైనింగ్ వారికి ఎంత ముట్టింది? ఇరిగేషన్ వారికి ఎంత అందింది? చెప్పాలని, ఈ విషయంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం అంతా అధికారుల నిర్లక్షానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగారావు,పిడి ఉసేన్,శంకర్, రంగారావు, కాసిం, మరియధాస్, కరీం, పక్రుదిన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగ పుశేని, మధు గౌడ్, పకీర్ సా, గ్రామ రైతులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో మండల స్థాయి విజేతలకు బహుమతులు పంపిణీ



వెలుగోడు ఆగస్టు 30 వార్త సాక్ష్యం

వెలుగోడు పట్టణంలోని డి పౌల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు మండల స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో 10వ తరగతికి చెందిన లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థిని దీక్ష శ్రీ మొదటి బహుమతి అందుకోగా , రెండవ బహుమతిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని సాయి ప్రణీత్ అందుకోగా , మూడవ బహుమతి కేజీబీవీ బాలికల పాఠశాలకు చెందిన సుమంజలి అందుకున్నారు. జూనియర్స్ విభాగంలో ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఏపీ మోడల్ స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థులు వెంకట లిఖిత్, మహేష్ నాయక్ , ప్రణవ్ అందు కున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిపౌల్ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రోయ్ బహుమతులను అందజేశారు. పోటీలను పిఈటిలు అశోకు , నాగన్న తదితరులు పర్యవేక్షించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు అభినందించారు.

## చెరువులో పూడిక తీత పనులు

వెలుగోడు ఆగస్టు 30 వార్త సాక్ష్యం



వెలుగోడు పట్టణంలోని శివారు ప్రాంతము నందు గల రామసముద్రం చెరువు నందు పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. విబి రాంజీ పథకం కింద జల ధార జల హారతి ద్వారా గత 15 రోజుల నుంచి శ్రామికుల చేత పూడికతీత పనులు జరుగుతున్నాయని ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమం కింద రోజుకు 200 నుంచి 300 వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ఈ పనులు చెరువుకు నీరు వచ్చేంతవరకు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమశీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరుగుతున్నాయి

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

నంద్యాల, ఆగస్టు, 30 వార్త సాక్ష్యం



జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో నేడు జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాల యాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పిం చవచ్చని, అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరిం చారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించరు.

# చేతులు లేని వారికి చేయూత



**-ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,**

**-రోటరీ డిస్ట్రిక్ట్ 3150 సంయుక్త ఆధ్వర్యంలో**

**దివ్యాంగులకు కృత్రిమ చేతులు**

కర్నూలు ఆగస్టు 30 వార్త సాక్ష్యం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ,విజయవాడ మరియు రోటరీ డిస్ట్రిక్ట్ 3150 సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్ఎన్-4 కృత్రిమ చేతుల శిబిరం కోసం,చేతులు లేని దివ్యాంగులకు కృత్రిమ చేతులు అందించే కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి సారాధ్యంలో ప్రత్యేక బస్సును కర్నూలు నుండి అనంతపురంకు పంపించడం జరిగింది.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్,కర్నూలు నుండి కృత్రిమ చేతుల లబ్ధిదారులతో బయలుదేరిన బస్సును కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె.అరుణ,ఎంసీ మెంబర్ భీమ శంకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతపురంలో నిర్వహించిన కృత్రిమ చేతుల శిబిరంలో కర్నూలు జిల్లా నుంచి వెళ్లిన 24 మంది లబ్ధిదారులకు కృత్రిమ చేతులు అమర్చి అందజేశారు.ఈ కార్యక్రమం ద్వారా చేతులు కోల్పోయిన వారికి నూతన జీవనోపాధి, ఆత్మవిశ్వాసం కల్పించే దిశగా ఈ సేవా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్ మధుసూదన్, డిస్ట్రిక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ బాబు,బ్లడ్ కౌన్సిలర్ యమ్మని శివన్న తదితరులు పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# నల్లగుంట్లకు ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి








**-అభివృద్ధి నోచుకోని నల్లగుంట్లపై ప్రత్యేక ద్రుష్టి సారించాలి**

**-వెలుగొండ ప్రాజెక్టు నీటితో సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**-న్యాయవాది కోడి మోహన్ రావు**

పెద్ద దోర్నాల ఆగస్టు 30 వార్త సాక్ష్యం

నల్లగుంట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలతో పాటు గిరిజన చెంచు కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వెలుగొండ ప్రాజెక్టు నుంచి నల్లగుంట్లకు ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని న్యాయవాది కోడి మోహన్ రావు ప్రజా ప్రయోజనార్థం గ్రామ ప్రజల తరపున ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నల్లగుంట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని బోటిమీది గూడెం, అయ్యన్న కుంట గూడెం, కొర్రపోలు, పెద్దమంతానల, మాదిగ వానికుంట చెంచుగూడెం తదితర గిరిజన చెంచు గూడెంలలో ప్రజలు అనేక సంవత్సరాలుగా సాగు, తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. నీటి వసతి లేకపోవడంతో వ్యవసాయం ఆశించిన స్థాయి లో సాగక, జీవనోపాధి కోసం అనేక కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**-సాగునీరు అందితే వలసలకు అడ్డుకట్ట**

నల్లగుంట్ల ప్రాంతానికి వెలుగొండ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందిస్తే సాగుభూములకు నీరందే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతులు తమ భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధిని కొనసాగించగలుగుతారు. ముఖ్యంగా గిరిజన చెంచు కుటుంబాలకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, వలసలను గణనీయంగా అరికట్టే అవకాశం ఉంటుందని ప్రజలు చెబుతు న్నారు. నీటి కొరత కారణంగా పంటలు సాగు చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. సాగునీరు అందుబాటులోకి వస్తే వ్యవసాయ భూములు అభివృద్ధి చెంది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**-తాగునీటి సమస్యకు కూడా పరిష్కారం**

సాగునీటితో పాటు తాగునీటి సమస్య కూడా ఈ ప్రాంత ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా వేసవి కాలంలో గిరిజన గూడెంల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీటిని అందించే విధంగా సమగ్ర పథకాన్ని రూపొందిస్తే సాగునీటితో పాటు తాగునీటి అవసరాలను కూడా తీర్చే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు నివసించే నల్లగుంట్ల గ్రామ రెవెన్యూ పరిధిని అభివృద్ధి చేయడంలో నీటి వనరుల కల్పన కీలకమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి సమస్య పరిష్కారమైతే విద్య, ఉపాధి, వ్యవసాయం తదితర రంగాల్లో కూడా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారు చెబుతున్నారు.

**-ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి**

నల్లగుంట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెలుగొండ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం మంజూరుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు సర్వే నిర్వహించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గిరిజన చెంచు గూడెంలతో పాటు నల్లగుంట్ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు సాగు, తాగునీరు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు నీటి కొరత కారణంగా జరుగుతున్న వలసలను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతు న్నారు. వెలుగొండ ప్రాజెక్టు నుంచి నల్లగుంట్లకు ఎత్తిపోతల పథకం మంజూరు చేయడం ద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రజల తరపున న్యాయవాది కోడి మోహన్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనంతపురంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత ప్రోస్తాటిక్ చేతుల పంపిణీ

**-నంద్యాల జిల్లా నుండి పదిమంది అర్హులకు లబ్ధి**



నంద్యాల ఆగస్టు 30 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రాంతాలవారీగా రోటరీ రెడ్ క్రాస్ సంయుక్త నిర్వహణలో ఉచిత ప్రోత్సటీక్ చేతుల పంపిణీ శిబిరాలు ఏర్పాటు చేయడ జరిగిందని అందులో భాగంగా రాయలసీమ ప్రాంతంలో ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన శిబిరానికి నంద్యాల గురురాజా ఇంగ్లీష్ మీడియం వారి సహకారంతో దాదాపు 15 మంది లబ్ధిదారులను అనంతపురంకు తీసుకువెళ్లి అందులో అర్హులైన పదిమందికి దాదాపు 30 వేలు విలువ కలిగిన ప్రోత్సటిక్ చేతులు పంపిణీ చేసినట్లు రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు మోచేతి కింద సుమారు ఐదు నుంచి పది ఇంచుల కండ కలిగిన వారికి దీనిని అమర్చడం జరుగుతుందని దీని ద్వారా ఐదు కేజీలు బరువు ఎత్తవచ్చు అని చిన్న చిన్న పనులు చేసుకోవచ్చు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపార నంద్యాల రెడ్ క్రాస్ డిఎఫ్ఓ అబ్దుల్లా ఆధ్వర్యంలో వారిని అనంతపురం తీసుకెళ్లినట్లు తెలిపారు. సహక రించిన గురురాజా స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు




# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాశీ చేయడమే నిజమైన ప్రజాసేవ







**-రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**-యాళ్లూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా ప్రారంభం**

**-విశ్రాంత పీఎఫ్ కమిషనర్ కైప శివరామిరెడ్డి సేవా దృక్పథం ఎంతో ఆదర్శనీయశీ**

**-వేలాది మందికి ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ**

నంద్యాల ఆగస్టు 30 వార్త సాక్ష్యం

గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అత్యాధునిక, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను స్వగ్రామంలోనే ఉచితంగా అందించడం ఎంతో అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఆదివారం యాళ్లూరు గ్రామంలో విశ్రాంత పీఎఫ్ కమిషనర్ మరియు టీడీపీ నాయకులు కైప శివరామిరెడ్డి ఆధ్వర్యంలో వారి పూర్వీకులు దివంగత కైప తిమ్మారెడ్డి, కైప జయరామిరెడ్డి, కైప వెంకట సుబ్బమ్మ, కైప చంద్రశేఖర్ రెడ్డి, బెక్కెం వెంకట లక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో కార్పొరేట్ వైద్యం పేద, మధ్యతరగతి ప్రజలకు పెనుభారంగా మారిన పరిస్థితుల్లో, గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతను కాంక్షిస్తూ ఇలాంటి భారీ శిబిరం నిర్వహించడం హర్షణీయమన్నారు. పదవీ విరమణ పొందినప్పటికీ సమాజ హితం కోసం పాటుపడుతూ, సొంత ఊరి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో కైప శివరామిరెడ్డి ఈ శిబిరాన్ని నిర్వహించడం ఆదర్శనీ యమని అన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ స్పెషలిస్ట్ వైద్యులంతా ఒకే వేదికపైకి వచ్చి గ్రామీణులకు వైద్య పరీక్షలు చేయడం గొప్ప పరిణామమని, గ్రామస్థులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదప డతాయని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎం అండ్ హెచ్ఓ డా. కైప శివశంకర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ , క్యాన్సర్ స్పెషలిస్ట్ డా. కె. సుధీర్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డా. కె. మధుసూదన్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డా. జె. బాబుల్ రెడ్డి, పీడియా ట్రిషియన్లు డా. ఆర్. కిరణ్ రెడ్డి, డా. బి. రత్నాకర్ రెడ్డి, స్త్రీల వైద్య నిపుణులు డా. కె. శివ లక్ష్మి, డా. కె. వసుంధర, న్యూరాలజిస్ట్ డా. కె. కల్యాణి, డయాగ్నోస్టిక్ నిపుణులు డా. కె. గీతారెడ్డి, దంత వైద్య నిపుణురాలు డా. బి. దివ్య తదితర నిపుణులు హాజరై రోగులను పరీక్షించారు. రోగులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలతో పాటు



అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కైప శివరామిరెడ్డి, కైప లక్ష్మీశ్రీకాంత్ రెడ్డి, తిమ్మారెడ్డి , జగన్నాథ్ రెడ్డి, ప్రసాదు, శేషారెడ్డి, రామేశ్వర్ రెడ్డి , వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి , నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , జిల్లెల్ల శ్రీరాములు, డాక్టర్ అనిల్ కుమార్ , మిద్దె ఉసేని, తాటికొండ బుగ్గ రాముడు, ఎం కృష్ణాపురం శేఖర్ రెడ్డి మరియు గ్రామ పెద్దలు, మండల నాయకులు, వైద్య సిబ్బంది, యాళ్లూరు గ్రామా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శ్రీశైల పుణ్యక్షేత్రశీ లో సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలం ఆగస్టు 30 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథంలో నిత్యకళారాధనలో ఆదివారం నటేశ్వరి ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్స్, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద రోజు సాయం కాలం నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు ఈ సంస్కృతిక కార్యక్ర మాలలో,వినాయకకౌత్వం, శివస్తుతి, శివాష్టకం. నమశ్శివాయతే, తదితర గీతాలకు, అష్టకాలకు విష్ణుప్రియ, అమూల్య,నిత్య, జ్ఞానచరిత,శ్రీదేవి, రమ్య తదితరులు నృత్యప్రదర్శన నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన



సంప్రదాయ కళల పరిరక్షణలో నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించరు

# నంద్యాల జిల్లాలోనీట్ పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ భద్రతా ఏర్పాట్లను ఆకస్మిక తనిఖీలు







**-బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు సిబ్బందికి పలు ఆదేశాలు**

**-జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్**

నంద్యాల ఆగస్టు 30 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లాలో నీట్ పీజీ 2026 కు సంబంధించి 04 పరీక్ష కేంద్రాలలో 770 అభ్యర్థులు హాజరయ్యే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం ఉదయం 9:00 గంటలకు పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్,ఐపీఎస్ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,నంద్యాల జిల్లాలో కెవిఆర్, ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, రామకృష్ణ పిజి కాలేజ్, ఆర్ జిఎం, ఇంజనీరింగ్ కాలేజ్ , శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష నిర్వహించడానికి ముందు రోజు నుండే 24/7 బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది.కేంద్ర అధికారులు మరియు టిసిఎస్ ప్రతినిధులతో సమన్వయం చేసుకునే పరీక్షా కేంద్రాలలోకి 8:30 గంటల లోపే అనుమతించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి ముందుగా ఫ్రిస్కింగ్ మరియు స్క్రీనింగ్ చేసి పరీక్షా కేంద్రంలో పలికి అనుమతించడం జరిగింది.పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు మరియు స్మార్ట్ వాచీలు, బ్లూటూత్, ఇయర్ పీస్ లు, ఏఐ గ్లాస్సెస్, చిన్న కెమెరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలతో సహా అన్ని నిషేధిత పరికరాలను అనుమతించకుండా స్క్రీనింగ్ చేయడంతో పాటు పరీక్షా ప్రశాంతంగా, సజావుగా మరియు పారదర్శకంగా నిర్వహిం చేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరిగింది. పరీక్ష కేంద్రాలలో మొబైల్ సిగ్నల్ పనిచేయకుండా జామర్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది.పరీక్షా కేంద్రల వద్ద ఒక ఉన్నతాధికారితో పాటు సరిపడా సిబ్బందిని నియమించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను నియమించి, ఎక్కడా అభ్యర్థులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరిగింది. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో డ్రోన్ పెట్రోలింగ్ తో పాటు సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్ బృందాల ద్వారా నిరంతర నిఘా మరియు పర్యవేక్షణ నిర్వహించారు.విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు



స్పెషల్ బ్రాంచ్ అధికారులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# కాప్రా చెరువులో గణేశ్ నిమజ్జనానికి నో

మల్కాజిగిరిఆగస్టు 30 వార్త సాక్ష్యం :

వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ మల్కాజిగిరి పరిధిలోని కాప్రా చెరువుపై హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది కాప్రా చెరువులో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఉండదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువు కేవలం నీటి వనరు కాదని, నగర పర్యావరణ సమతుల్యతకు ఎంతో కీలకమైన అర్బన్ వెట్‌ల్యాండ్ అని ఆయన పేర్కొన్నారు. కాప్రా చెరువు అభివృద్ధి, పునరుద్ధరణ పనులను పరిశీలించేందుకు శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమై నిమజ్జ నాల వల్ల చెరువు జీవవైవిధ్యానికి కలిగే ప్రభావాన్ని వివరించారు. చెరువు సహజ స్వరూపాన్ని కాపాడేందుకు ఉత్సవ కమిటీలు, భక్తులు సహకరించాలని కోరారు.

**-చిన్న విగ్రహాలకు బేబీ పాండ్**

కాప్రా చెరువులో నిమజ్జనానికి బదులుగా చిన్న గణేశ్ విగ్రహాలను సమీపంలోని బేబీ పాండ్‌లో నిమజ్జనం చేసుకోవచ్చని హైడ్రా సూచించింది. పెద్ద విగ్రహాలకు మాత్రం ఇతర ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించింది. దీంతో కాప్రా చెరువు పరిసరాల్లో నిమజ్జనాల నిర్వహణపై ముందుగానే స్పష్టత వచ్చినట్లయింది.

**-470కి పైగా వలస పక్షులకు ఆవాసం**

కాప్రా చెరువు ప్రత్యేకత దాని జీవవైవిధ్యంలో ఉందని అధికారులు చెబుతున్నారు. ఆస్ట్రేలియా, యూరప్ సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కి పైగా వలస పక్షులకు ఈ చెరువు ఆవాసంగా ఉంటుందని రంగనాథ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన అర్బన్ వెట్‌ల్యాండ్స్‌లో కాప్రా చెరువుకు స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. చెరువును సందర్శించిన సందర్భంగా ఇక్కడికి వచ్చే వలస పక్షులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కూడా ఆయన పరిశీలించారు.

**-113 ఎకరాల్లో పునరుద్ధరణ పనులు**

సుమారు 113 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాప్రా చెరువును హైడ్రా పునరుద్ధరిస్తోంది. వరద నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంచడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, పక్షుల ఆవాసాలను కాపాడటం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. చెరువు పరిధిలో దాదాపు 70 శాతం వరకు ప్రైవేట్ పట్టా భూములు ఉన్నప్పటికీ, వాటి యజమా నులు చెరువు అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారని రంగనాథ్ చెప్పారు. కాప్రా లేక్ రివైవల్ గ్రూప్ ప్రతినిధులు కూడా అధికారులను కలిసి చెరువు అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**-కాలుష్య నియంత్రణపై దృష్టి**

వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ, నిర్వహణ నిబంధనలు--2017 ప్రకారం చెరువుల హద్దులను నిర్ధారించడం, ఆక్రమణలను అడ్డుకోవడం, కాలుష్యాన్ని నియంత్రి ంచడం వంటి చర్యలు అవసరమని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కాప్రా చెరువును పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా చెరువుల్లో విగ్రహాలు, పూజా సామగ్రి, ఇతర వ్యర్థాలు చేరడం వల్ల నీటి నాణ్యత, జలచరాలు, పక్షుల ఆవాసాలపై ప్రభావం పడే అవకాశం ఉండటంతోనే కాప్రా చెరువును నిమజ్జ నాల నుంచి మినహాయించాలని హైడ్రా నిర్ణయిం చినట్లు అధికారులు వివరించారు. ఈ నిర్ణయంపై భక్తులు, ఉత్సవ కమిటీలు సహకరించాలని హైడ్రా విజ్ఞప్తి చేసింది.

**-నిమజ్జనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేశ్ నిమజ్జనాల కోసం ఇప్పటికే బేబీ పాండ్లు, ఇతర ఏర్పాట్లపై



అధికారులు దృష్టి సారించారు. సఫిల్‌గూడ లేక్ బేబీ పాండ్, బండచెరువు బేబీ పాండ్ తదితర ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు కొనసాగు తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, భక్తుల విశ్వాసం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాప్రా చెరువు భవిష్యత్‌లో నగరానికి కీలకమైన పర్యావరణ వనరుగా నిలిచేలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా హైడ్రా ముందుకు సాగుతోంది.

# అండర్--12 ఫ్రెండ్‌షిప్ టోర్నీలో శ్రీలంకపై హైదరాబాద్ జట్టు ఘన విజయం

**-సత్తా చాటిన సిద్దిపేట కుర్రాళ్లు..**

**-కెప్టెన్ ముత్యాల విశ్వ తేజకు అభినందనల వెల్లువ**

నంగునూరు, ఆగస్టు 30 వార్త సాక్ష్యం :

అంతర్జాతీయ స్థాయి అండర్--12 ఫ్రెండ్ షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. హైదరాబాద్ వేదికగా ఏఎస్ స్పోర్ట్స్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగిన ఇండియా, శ్రీలంక అండర్--12 ఫ్రెండ్‌షిప్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచి సత్తా చాటింది. ఈ టోర్నీలో హైదరాబాద్ జట్టు తరఫున ఆడిన సిద్ధిపేటకు చెందిన యువ క్రికెటర్లు తమ ప్రతిభను చాటు కోవడం విశేషంగా నిలిచింది. జట్టులో దాదాపు ఎనిమిది మంది ఆటగాళ్లు సిద్ధిపేట పట్టణానికి చెందిన వారు ఉన్నారు. మిగిలిన ఆటగాళ్లు హైదరాబాద్‌కు చెందినవారు. ముఖ్యంగా సిద్ధిపేటకు చెందిన ముత్యాల విశ్వ తేజ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును విజయ పథంలో నడిపించడం అభినందనీయం.

**-నాలుగు మ్యాచ్‌ల్లో విశ్వతేజ బ్యాటింగ్ జోరు**

టోర్నీ ఆరంభం నుంచి కెప్టెన్ ముత్యాల విశ్వ తేజ బ్యాటింగ్‌లో తన సత్తా చాటాడు. వరుసగా జరిగిన మ్యాచ్‌లలో 46, 25, 54, 25 పరుగులు సాధించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఒత్తిడిలోనూ సమర్థవంతంగా బ్యాటింగ్ చేశాడు. జట్టుకు అవసరమైన పరుగులు సాధించి తన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాడు. విశ్వ తేజతో పాటు సిద్ధిపేటకు చెందిన ఇతర యువ ఆటగాళ్లు కూడా సమష్టిగా రాణించడంతో హైదరాబాద్ జట్టు టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచింది.

**-ఫైనల్లో ఉత్కంఠ భరిత పోరు**

ఇండియా--శ్రీలంక అండర్--12 ఫ్రెండ్‌షిప్ టోర్నీలో మొత్తం నాలుగు జట్లు పాల్గొన్నాయి. హైదరాబాద్ జట్టు, ఎలైట్ ప్రో జట్టు, శ్రీలంక జట్టు, తెలంగాణ జట్టు పోటీలో పాల్గొన్నాయి. లీగ్ దశలో ప్రతిభ కనబరిచిన హైదరాబాద్, ఎలైట్ ప్రో జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇరవై ఓవర్ల ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఎలైట్‌ప్రో జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. హైదరాబాద్ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లు పూర్తికాక ముందే 16 ఓవర్లలో 87 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. 87 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఆత్మ విశ్వాసంతో బ్యాటింగ్ చేసింది. కేవలం 14 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 88 పరుగులు సాధించి ఘన విజయాన్ని నమోదు చేసింది. దీంతో హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో విజయం సాధించి టోర్నీని సొంతం చేసుకుంది.

**-విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీకి చెందిన ఆటగాళ్ల ప్రతిభ**

హైదరాబాద్ జట్టు విజయానికి మరో ప్రత్యేకత ఉంది. జట్టు కెప్టెన్ ముత్యాల విశ్వ తేజతో పాటు పలువురు సిద్ధిపేట క్రీడాకారులు సిద్ధిపేట విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వారే కావడం విశేషం. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లతో పోటీ పడే అవకాశం లభించడం యువ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. క్రమశిక్షణ, నిరంతర సాధన, కోచ్‌ల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం యువ ఆటగాళ్ల విజయానికి దోహద పడుతున్నాయని క్రీడాభిమానులు పేర్కొన్నారు.

**-సిద్దిపేట క్రీడాకారులకు అభినందనలు**



అండర్--12 ఫ్రెండ్ షిప్ టోర్నీలో హైదరాబాద్ జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన సిద్ధిపేట యువ క్రికెటర్లపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కెప్టెన్ ముత్యాల విశ్వతేజ తన బ్యాటింగ్ ప్రతిభతో పాటు నాయకత్వ పటిమను ప్రదర్శించి జట్టును విజయ తీరాలకు చేర్చడంపై పలువురు అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే ఇటువంటి టోర్నీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవడం భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్‌కు సిద్ధిపేట నుంచి మరింత మంది క్రీడాకారులు ఎదగడానికి దోహదపడుతుందని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**-మరిన్ని విజయాలు సాధించాలి**

యువ క్రికెటర్లు ఇదే స్ఫూర్తితో మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొని తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు. క్రీడల ద్వారా పిల్లల్లో శారీరక ధారుడ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. సిద్ధిపేట నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రికెటర్లు ఎదగాలంటే చిన్ననాటి నుంచే ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ, పోటీ వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని క్రీడా వర్గాలు అభిప్రాయ పడ్డాయి. ఈ టోర్నీలో విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీ కోచ్ ముత్యాల ఆనంద్, ఆర్గనైజర్ అంజితో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. హైదరాబాద్ జట్టు విజయం వెనుక ఆటగాళ్ల సమష్టి కృషితో పాటు కోచ్‌లు, నిర్వాహకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకంగా నిలిచింది. సిద్ధిపేట మట్టిలో పుట్టిన ఈ చిన్నారుల క్రికెట్ ప్రతిభ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరింతగా మెరవాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.